3-08-2026_Layout 1 03-08-2026 19:15 Page 1

అక్షరశక్తి
The Power of Pen
Evening Daily

సోమవారం 3 ఆగస్టు 2026 | వరంగల్ | సంపుటి: 20 | సంచిక: 273 | పేజీలు 06



# నిమ్స్ ఘనత

## రెండున్నరేళ్లలో వెయ్యి రోబోటిక్ శస్త్రచికిత్సలు పూర్తి

## డైరెక్టర్‌ను అభినందించిన సీఎం రేవంత్‌రెడ్డి

**అక్షరశక్తి, హైదరాబాద్ :** నిమ్స్‌లో రెండున్నరేళ్లలో వెయ్యి రోబోటిక్ శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి అయ్యాయని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ ఘనత సాధించినందుకు నిమ్స్ డైరెక్టర్ రాహుల్ దేవరాజ్‌తో పాటు వైద్య బృందం, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ బృందానికి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పం నెరవేరిందని వ్యాఖ్యానించారు. నిమ్స్‌లో ఇప్పటివరకు నిర్వహించిన రోబోటిక్ సర్జరీల్లో 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఉచితంగా నిర్వహించడం ప్రత్యేకంగా అభినందించాల్సిన విషయమని సీఎం పేర్కొన్నారు. ఇటీవలే రెండు వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను పూర్తి చేసిన నిమ్స్, ఇప్పుడు వెయ్యి రోబోటిక్ సర్జరీల మైలురాయిని చేరుకోవటం ద్వారా కొత్త రికార్డు నెలకొల్పిందని చెప్పుకొచ్చారు. వైద్య రంగంలో నిమ్స్ మరిన్ని మైలురాళ్లు సాధించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు.

# అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్ ప్రకటించి మోసం చేశారు: కేటీఆర్

**అక్షరశక్తి, హైదరాబాద్ :** అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్ ప్రకటించి కాంగ్రెస్ నేతలు మోసం చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో సోమవారం మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నియోజకవర్గం మధిరలో గడ్డం వేణు అనే యువకుడు ఆత్మహత్యాయత్నం చేసుకున్నారని ప్రస్తావించారు. రెండు పేజీల సూసైడ్ నోట్‌లో సీఎం, డిప్యూటీ సీఎం, రాహుల్‌గాంధీకి రాశారని.. గడ్డం వేణు రాసింది సూసైడ్ నోట్ కాదని కాంగ్రెస్ పాలనపై ఛార్జ్‌షీట్ అని చెప్పుకొచ్చారు.



3-08-2026_Layout 1 03-08-2026 19:15 Page 2






# విశ్వాసమే విజయానికి వంతెన

- పీహెచ్ఎస్ ప్రాజెక్ట్స్‌తో జాతీయ స్థాయిలో ముద్ర వేసిన పడిదల నవీన్‌కుమార్
- కార్పొరేట్ నిర్మాణ రంగంలో నమ్మకానికి చిరునామా
- కలను సంస్థగా... సంస్థను బ్రాండ్‌గా మలిచిన యువపారిశ్రామికవేత్త

**కష్టాన్ని మూలధనంగా, నాణ్యతను పెట్టుబడిగా, విశ్వాసాన్ని విజయానికి పునాదిగా మార్చుకుంటే సాధారణ వ్యక్తి కూడా అసాధారణ విజయాలను సొంతం చేసుకోవచ్చని నిరూపించిన యువ పారిశ్రామికవేత్త పడిదల నవీన్‌కుమార్. కార్పొరేట్ సివిల్ నిర్మాణం, ప్రీమియం ఇంటీరియర్ సొల్యూషన్స్ రంగంలో పీహెచ్ఎస్ ప్రాజెక్ట్స్‌ను దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన సంస్థగా తీర్చిదిద్దిన ఆయనకు టైమ్స్ ఆఫ్ ఇండియా తెలంగాణ--2026 ఎక్సలెన్స్ ఇన్ కార్పొరేట్ సివిల్ అండ్ ఇంటీరియర్ సొల్యూషన్స్ అవార్డు లభించడం మరో మైలురాయిగా నిలిచింది. తెలంగాణ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా సమక్షంలో, నటుడు సోను సూద్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకోవడం ఆయన ప్రస్థానానికి ప్రత్యేక గౌరవాన్ని తీసుకొచ్చింది.** *- అక్షరశక్తి, వరంగల్*



### నాణ్యతే విజయానికి పునాది

సమగ్ర ఇంజినీరింగ్ సేవలు, టర్న్‌కీ ప్రాజెక్టుల అమలులో పీహెచ్ఎస్ ప్రాజెక్ట్స్ ప్రత్యేక గుర్తింపును సంపాదించింది. సివిల్ నిర్మాణాలు, కార్పొరేట్ ఇంటీరియర్స్, పునరుద్ధరణ పనులు, ఎంఈపీ సేవల్లో కచ్చితత్వం, సమయపాలన, నాణ్యతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వడం సంస్థ విజయానికి మూలస్తంభాలయ్యాయి. మైక్రోసాఫ్ట్, డెల్ టెక్నాలజీస్, విప్రో, టెక్ మహీంద్రా, సైయంట్, యూనిసిస్, బ్రాడ్‌రిడ్జ్ వంటి అంతర్జాతీయ సంస్థలతో పాటు మహీంద్రా యూనివర్సిటీ, ఫ్లేమ్ యూనివర్సిటీ వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తి చేసి విశ్వసనీయ భాగస్వామిగా నిలిచింది.

### దేశవ్యాప్త గుర్తింపు...
### సామాజిక బాధ్యతలోనూ ముందంజ

మహీంద్రా యూనివర్సిటీలో చేపట్టిన నిర్మాణ, పునరుద్ధరణ, ప్రీమియం ఇంటీరియర్ పనుల నాణ్యతకు ఆనంద్ మహీంద్రా నుంచి ప్రశంసలు అందుకోవడం సంస్థకు అరుదైన గుర్తింపుగా నిలిచింది. హైదరాబాద్, బెంగళూరు, పూణే, ముంబై, చెన్నై, నోయిడా తదితర నగరాల్లో పలు కీలక ప్రాజెక్టులను పూర్తి చేసిన పీహెచ్ఎస్ ప్రాజెక్ట్స్ దేశవ్యాప్తంగా తన ముద్ర వేసింది. వ్యాపార విజయాలతో పాటు నిరుపేద విద్యార్థుల విద్యకు ఆర్థిక సహాయం, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలకు చేయూతనిస్తూ నవీన్‌కుమార్ సామాజిక బాధ్యతను కూడా సమానంగా నిర్వర్తిస్తున్నారు.

### ప్రతి నిర్మాణం వెనుక ఒక విలువ

వ్యాపారాన్ని లాభాలకే పరిమితం చేయకుండా విశ్వాసాన్ని నిర్మించడం, దీర్ఘకాలిక భాగస్వామ్యాలను ఏర్పరచుకోవడం, సమాజానికి తిరిగి ఇవ్వడం అనే విలువలతో పడిదల నవీన్‌కుమార్ ముందుకు సాగుతున్నారు. నాణ్యత, ఆవిష్కరణ, నైతిక నాయకత్వాన్ని సమన్వయం చేస్తూ భారత కార్పొరేట్ నిర్మాణ రంగంలో పీహెచ్ఎస్ ప్రాజెక్ట్స్‌ను అగ్రశ్రేణి సంస్థగా నిలబెట్టే దిశగా అడుగులు వేస్తున్నారు. "ప్రతి ప్రాజెక్టు ఒక నిర్మాణం మాత్రమే కాదు... నాణ్యత, నిజాయితీ, శాశ్వత విలువలకు ప్రతీక" అనే ఆయన ఆలోచనే విజయగాథకు అసలైన బలంగా నిలుస్తోంది.



3-08-2026_Layout 1 03-08-2026 19:15 Page 3



# 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకురావాలి

**డా. పగడాల కాళీ ప్రసాద్ రావు**



**అక్షరశక్తి, పరకాల:** పరకాల ప్రజల ఆరోగ్యంపై ఎమ్మెల్యేకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే వెంటనే 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని అన్ని సౌకర్యాలతో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పరకాల కాంటెస్టెంట్ ఎమ్మెల్యే డా. పగడాల కాళీ ప్రసాద్ రావు డిమాండ్ చేశారు. భారతీయ జనతా పార్టీ పరకాల పట్టణ శాఖ అధ్యక్షులు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో పరకాల ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించిన అనంతరం, కోట్ల రూపాయలతో నిర్మించిన 100 పడకల నూతన ప్రభుత్వ ఆసుపత్రిని వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఆసుపత్రి ముందు పరకాల--హనుమకొండ ప్రధాన రహదారిపై భారీ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా. పగడాల కాళీ ప్రసాద్ రావు, బీజేపీ రాష్ట్ర నాయకులు డా. సిరంగి సంతోష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. పగడాల కాళీ ప్రసాద్ రావు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు వైద్యం అందించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రెండు రోజుల క్రితం తెల్లవారుజామున పురిటి నొప్పులతో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన స్వర్ణలత అనే గర్భిణీకి డ్యూటీలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో 108 అంబులెన్స్‌లో వరంగల్‌కు తరలించాల్సి వచ్చిందని, మార్గమధ్యంలోనే ప్రసవం జరగడం ప్రభుత్వ వైద్య వ్యవస్థ వైఫల్యానికి అద్దం పడుతోందన్నారు. నెల రోజుల్లోగా 100 పడకల నూతన ప్రభుత్వ ఆసుపత్రిని పూర్తిస్థాయిలో ప్రారంభించి, అన్ని వైద్య పోస్టులను భర్తీ చేసి, అవసరమైన పరికరాలు, సిబ్బందిని నియమించాలి. లేనిపక్షంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టి, ప్రభుత్వం స్పందించే వరకు పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.పి. జయంతిలాల్, మున్సిపల్ కౌన్సిలర్లు కుక్కల విజయ్ కుమార్, బెజ్జంకి పూర్ణచారి, ఆకుల లావణ్య శ్రీధర్, పరకాల పట్టణ ప్రధాన కార్యదర్శులు సంఘ పురుషోత్తం, పాలకుర్తి తిరుపతి, బీజేపీ నాయకులు దగ్గు విజేందర్ రావు, సిరంగి సతీష్ కుమార్, మార్త రాజభద్రయ్య, ఎరుకల దివాకర్, కాసాగాని రాజ్‌కుమార్, దంచనాదుల సత్యనారాయణ, మిడిదొడ్డి నరేష్, దుబాసి కృష్ణప్రసాద్, దంచనాదుల కిరణ్, కానుగుల గోపీనాథ్, ముత్యాల దేవేందర్, కుంట మల్ల గణేష్, పిట్ట కిషోర్, తడక పూర్ణచందర్, కొలనుపాక రేవంత్ సిద్ధు, కక్కు రాజు, గుణిగంటి రఘుపతి, రంతు తదితరులు పాల్గొన్నారు.



## కాళేశ్వరం పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ



**అక్షరశక్తి, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ వార్షిక తనిఖీల్లో భాగంగా కాళేశ్వరం పోలీస్ స్టేషన్‌ను సందర్శించి సమగ్ర తనిఖీ నిర్వహించారు. జిల్లాలో పోలీస్ వ్యవస్థ పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలు, కేసుల దర్యాప్తు పురోగతి, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీస్ స్టేషన్ ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలను నాటడం జరిగింది, అనంతరం పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. రోడ్డు ప్రమాద కేసులకు సంబంధించిన వాహనాల స్థితిగతులు, వాటి పరిష్కార పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రిసెప్షన్ విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, అందిన ప్రతి ఫిర్యాదును వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల పురోగతిని సమీక్షించిన ఎస్పీ గారు, దర్యాప్తు వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ వార్షిక తనిఖీలలో కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, మహాదేవ్‌పూర్ సిఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## సైబర్ క్రైమ్‌పై ప్రత్యేక శిక్షణ

**అక్షరశక్తి, వరంగల్:** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, ఇతర పోలీసు అధికారులకు సైబర్ నేరాల దర్యాప్తుపై ఒకరోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (కిట్స్)లో నిర్వహించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాలు, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ సూచనల మేరకు సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్థిక సైబర్ నేరాల దర్యాప్తు, డిజిటల్ సాక్ష్యాల సేకరణ, సైబర్ పోర్టల్ల వినియోగం, "గోల్డెన్ అవర్"లో స్పందన, బాధితులకు సత్వర న్యాయం అందించే విధానాలపై అధికారులు శిక్షణ అందించారు. సైబర్ క్రైమ్ ఎస్‌హెచ్‌ఓ ఎం. వెంకట రమణతో పాటు



పలువురు ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు మరియు సైబర్ క్రైమ్ సిబ్బంది వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా సైబర్ నేరాల దర్యాప్తులో పోలీసు అధికారుల సామర్థ్యం మరింత మెరుగుపడుతుందని అధికారులు తెలిపారు.



## డిగ్రీ సెమిస్టర్ పరీక్షా ఫలితాల విడుదల

**అక్షరశక్తి,హనుమకొండ:** కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో 2026 మే నెలలో నిర్వహించిన డిగ్రీ మొదటి, రెండవ, మూడవ, నాల్గవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య రాజేందర్ కట్ల మాట్లాడుతూ, మొదటి సెమిస్టర్‌లో 28 శాతం, రెండవ సెమిస్టర్‌లో 33 శాతం, మూడవ సెమిస్టర్‌లో 38 శాతం, నాల్గవ సెమిస్టర్‌లో 38 శాతం ఉత్తీర్ణత నమోదైందని తెలిపారు. విద్యార్థులు తమ ఫలితాలను కాకతీయ విశ్వవిద్యాలయం అధికారిక వెబ్‌సైట్ www.kakatiya.ac.inలో పరిశీలించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ తిరుమల దేవి, డాక్టర్ వెంకటయ్య, డాక్టర్ నాగరాజు, డాక్టర్ పద్మజ, డాక్టర్ అసీం ఇక్బాల్, సహాయ రిజిస్ట్రార్ రామా వెంకటేశ్వర్లు, నాయకపు సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## రిమాండ్ ఖైదీ మృతి



**అక్షరశక్తి, హన్మకొండ క్రైం :** మహబూబాబాద్ సబ్ జైల్లో ఉన్న రిమాండ్ ఖైదీ వెంకన్న మృతి చెందాడు. 2017 లో హత్యా నేరంలో నిందితుడిగా ఉన్నాడు. బెయిల్ పై బయటికి వచ్చాక కోర్టుకు హాజరు కాకపోవడంతో అరెస్టు వారెంట్ జారీ చేయడంతో నిందితుడిని జులై 31న కి తీసుకున్న పోలీసులు ఒకటవ తేదీ కోర్టులో హాజరు హాజరు పరిచి మహబూబాద్ తరలించారు. జైల్లో అస్వస్థతకు గురికావడంతో జైలు అధికారులు ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ వెంకన్న మృతి చెందాడు. కాగా, జైలు అధికారులు కొట్టడం వల్లే వెంకన్న మృతి చెందాడని ఎంజీఎం మార్చురీ వద్ద వెంకన్న బంధువులు ఆరోపించారు.

## రోడ్డు ఆక్రమిస్తున్నారని ప్రజావాణిలో ఫిర్యాదు

**అక్షరశక్తి, హన్మకొండ :** హనుమకొండ లక్ష్మీపురం న్యూ బస్టాండ్ సమీపంలోని కాలనీలో రాజబాబు గండె కృష్ణ అనే వ్యక్తులు తన ఇంటి స్థలం కు ఆనుకొని ఉన్న రోడ్డు పై ప్రహరి గోడ నిర్మించి రోడ్డును ఆక్రమించారని... ఆక్రమణ దారులపై చర్యలు తీసుకొని కాలనీవాసులకు రోడ్డును అందుబాటులోకి తీసుకురావాలని ఇన్చార్జి కలెక్టర్ ఎన్. రవికి ప్రజావాణిలో కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును వెంటనే సంబంధిత జి డబ్ల్యు ఎం సి కాజీపేట డిప్యూటీ కమిషనర్ కు అప్పగించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు ఇన్చార్జ్ కలెక్టర్ ఎం రవి ఈ కార్యక్రమంలో కాలనీవాసులు నవీన్, శీను, సతీష్, చిదరాల శ్రీను, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

# గత చరిత్రను విస్మరించిన జాతి - మరో చరిత్రను సృష్టించలేదు

చరిత్ర అంటే కేవలం గతాన్ని గుర్తు చేసుకోవడం కాదు. వర్తమానాన్ని సరిదిద్దుకొని భవిష్యత్తును నిర్మించుకోవడానికి ఒక జాతి నేర్చుకునే జీవన పాఠం. వ్యక్తికి జ్ఞాపకశక్తి ఎంత అవసరమో, ఒక జాతికి చరిత్ర అంత అవసరం. గతంలో జరిగిన విజయాలు, వైఫల్యాలు, యుద్ధాలు, విప్లవాలు, సంస్కరణలు, నాగరికతల ఉత్థాన--పతనాలు, ప్రజల పోరాటాలు, రాజ్యాల ఆవిర్భావం, పతనం వంటి అనేక అనుభవాలను ఒక తరం నుంచి మరో తరానికి అందించేది చరిత్ర మాత్రమే. అందుకే ప్రపంచంలోని ప్రతి అభివృద్ధి చెందిన దేశం చరిత్రను కేవలం ఒక పాఠ్యాంశంగా కాకుండా, జాతీయ చైతన్యాన్ని నిర్మించే శక్తివంతమైన సాధనంగా చూస్తోంది. "చరిత్రను గుర్తుంచుకోలేని వారు దానిని మళ్లీ పునరావృతం చేయడానికి శిక్షించబడతారు" అని తత్వవేత్త జార్జ్ సాంటాయానా చెప్పిన మాట నేటికీ సజీవ సత్యమే. బ్రిటిష్ చరిత్రకారుడు ఈ. హెచ్. కార్ "చరిత్ర అనేది గతానికీ వర్తమానానికీ మధ్య జరిగే నిరంతర సంభాషణ" అని నిర్వచించారు. బ్రిటిష్ నాయకుడు విన్స్టన్ చర్చిల్ "ఎంత వెనక్కి చూడగలిగితే అంత ముందుకు చూడగలుగుతారు" అని పేర్కొన్నారు. ఈ మూడు వ్యాఖ్యలే చరిత్ర ప్రాముఖ్యతను అద్భుతంగా వివరిస్తాయి. ఒక దేశం తన గతాన్ని అర్థం చేసుకోకపోతే, అదే తప్పులను మళ్లీ మళ్లీ చేసే ప్రమాదం ఉంటుంది.

చరిత్ర ప్రభావం ఎంత శక్తివంతమైనదో ప్రపంచాన్ని గడగడలాడించిన నియంతలు కూడా గుర్తించారు. జర్మనీ నియంత అడాల్ఫ్ హిట్లర్ చరిత్ర అధ్యయనం ప్రజల్లో ప్రశ్నించే స్వభావాన్ని, తిరుగుబాటు చైతన్యాన్ని పెంచుతుందని భావించాడని చరిత్రలో తరచూ ప్రస్తావిస్తారు. అలాగే ఫ్రెంచ్ చక్రవర్తి నెపోలియన్ బోనాపార్టీకు ఆపాదించబడే ఒక ప్రసిద్ధ వ్యాఖ్య ప్రకారం, చరిత్ర, రాజకీయాలను లోతుగా అధ్యయనం చేసిన కొద్దిమంది యువకులు కూడా పెద్ద సైన్యంతో సమానమైన ప్రభావాన్ని చూపగలరని భావన వ్యక్తమవుతుంది. ఈ వ్యాఖ్యల చారిత్రక ప్రామాణికతపై పండితుల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, వాటి వెనుక ఉన్న సందేశం మాత్రం స్పష్టంగా ఉంటుంది. చరిత్ర మనిషిలో విమర్శనాత్మక ఆలోచనను, సామాజిక స్పృహను, మార్పు కోసం నిలబడే ధైర్యాన్ని పెంపొందిస్తుంది.

సామాజిక శాస్త్రాలలో చరిత్రకు అత్యంత కీలకమైన స్థానం ఉంది. రాజకీయ శాస్త్రం, ఆర్థిక శాస్త్రం, సమాజ శాస్త్రం, ప్రజా పరిపాలన, అంతర్జాతీయ సంబంధాలు, న్యాయశాస్త్రం వంటి అన్ని శాఖలకు చరిత్రే పునాది. చరిత్ర తెలియకుండా రాజ్యాంగ పరిణామం అర్థం కాదు. ప్రజాస్వామ్య వికాసం అర్థం కాదు; సామాజిక అసమానతల మూలాలు అర్థం కావు; యుద్ధాలు, శాంతి ఒప్పందాలు, విప్లవాలు, సంస్కరణల ప్రభావాన్ని అంచనా వేయడం కూడా సాధ్యం కాదు. అందుకే చరిత్రను అనేక విద్యావేత్తలు సామాజిక శాస్త్రాల వెన్నెముకగా అభివర్ణిస్తారు. ఈ విషయాన్ని అభివృద్ధి చెందిన దేశాలు చాలా ముందుగానే గుర్తించాయి.

అమెరికాలోని హార్వర్డ్ విశ్వవిద్యాలయం, యేల్ విశ్వవిద్యాలయం, ప్రిన్స్టన్ విశ్వవిద్యాలయం, బ్రిటన్‌లోని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం, కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం వంటి విశ్వవిద్యాలయాల్లో చరిత్రకు ప్రత్యేక విభాగాలు, పరిశోధనా కేంద్రాలు, డిజిటల్ ఆర్కైవ్స్, మ్యూజియంలు, అరుదైన పత్రాల భాండాగారాలు ఏర్పాటు చేశారు. అక్కడ చరిత్ర విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలు చదవడం మాత్రమే కాదు, శాసనాలు, చారిత్రక పత్రాలు, న్యాయ రికార్డులు, పాత పత్రికలు, జనాభా గణాంకాలు, పురావస్తు ఆధారాలను విశ్లేషిస్తూ శాస్త్రీయ పరిశోధన చేస్తారు. స్కూల్ స్థాయి నుంచే మ్యూజియంల సందర్శనలు, చారిత్రక కట్టడాల అధ్యయనం, మూలాధారాల విశ్లేషణ వంటి పద్ధతుల ద్వారా విద్యార్థుల్లో ప్రశ్నించే స్వభావాన్ని పెంపొందిస్తారు.

దీనికి భిన్నంగా, భారతదేశంలోని కొన్ని రాష్ట్రాల్లో, ముఖ్యంగా ఒకప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, చరిత్ర సబ్జెక్ట్ క్రమంగా తన ప్రాధాన్యతను కోల్పోయింది. విద్యా సంస్కరణల పేరిట ఉపాధి కల్పించే సబ్జెక్టులపైనే ఎక్కువ దృష్టి పెట్టడంతో చరిత్ర వంటి సామాజిక శాస్త్రాలు వెనుకబడ్డాయి. ఇంటర్మీడియట్ స్థాయిలో చరిత్రను ప్రధానంగా అధ్యయనం చేసే విద్యార్థుల సంఖ్య బాగా తగ్గింది. అనేక ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చరిత్ర అధ్యాపకుల పోస్టులు తగ్గిపోయాయి లేదా ఇతర సామాజిక శాస్త్రాలతో కలిపి బోధించే పరిస్థితి ఏర్పడింది. దీని ప్రభావం కేవలం ఒక సబ్జెక్టుపైనే కాదు; సమాజంలో చారిత్రక స్పృహ, ప్రజాస్వామ్య అవగాహన, ప్రాంతీయ చరిత్రపై ఆసక్తి కూడా తగ్గడానికి దోహదపడింది.

ప్రాంతీయ చరిత్రను నిర్లక్ష్యం చేయడం అంటే ఒక ప్రాంతపు సామాజిక స్మృతిని బలహీనపరచడమే. ఈ వాస్తవాన్ని తెలంగాణ అనుభవం స్పష్టంగా తెలియజేస్తుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో విద్యా విధానాల్లో వచ్చిన మార్పుల కారణంగా ఇంటర్మీడియట్ స్థాయిలో చరిత్ర సబ్జెక్ట్ క్రమంగా ఆదరణ కోల్పోయింది. ఉపాధి అవకాశాలను దృష్టిలో పెట్టుకొని సైన్స్, కామర్స్, వృత్తి విద్యా కోర్సులపై ఎక్కువ దృష్టి పెట్టడం జరిగింది. ఫలితంగా చరిత్రను అధ్యయనం చేసే విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. అనేక జూనియర్ కళాశాలల్లో చరిత్ర అధ్యాపకుల పోస్టులు భర్తీ కాకపోవడం, కొన్ని చోట్ల చరిత్ర--పౌరశాస్త్రం ఉమ్మడి పోస్టులుగా కొనసాగడం, మోడల్ స్కూల్స్, కొన్ని గురుకుల విద్యాసంస్థల్లో ప్రత్యేక చరిత్ర అధ్యాపకులు లేకపోవడం వంటి పరిస్థితులు ఈ సబ్జెక్టు ప్రాధాన్యతను మరింత తగ్గించాయి.

దీని ప్రభావం విద్యా వ్యవస్థకే పరిమితం కాలేదు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, రైతాంగ పోరాటాలు, నిజాం కాలపు సామాజిక పరిస్థితులు, భాషా ప్రత్యేకత, ప్రాంతీయ ఉద్యమాల నేపథ్యం వంటి అంశాలపై యువతలో అవగాహన తగ్గిందనే ఆందోళనను అనేక మంది విద్యావేత్తలు వ్యక్తం చేశారు. ఒక ప్రాంత చరిత్రను చదవని తరం, ఆ ప్రాంత అస్తిత్వాన్ని కూడా పూర్తిగా అర్థం చేసుకోలేదని వారు అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్ర చరిత్ర, తెలంగాణ ఉద్యమ చరిత్రకు పోటీ పరీక్షల్లో ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం, గ్రూప్-1, గ్రూప్-2 వంటి పరీక్షల్లో ప్రత్యేక భాగాలుగా చేర్చడం ఈ లోటును కొంతవరకు పూరించడానికి చేసిన ప్రయత్నంగా చూడవచ్చు.

అయితే చరిత్ర ప్రాధాన్యత పోటీ పరీక్షల వరకే పరిమితం కావడం సరిపోదు. విద్యార్థి డాక్టర్ అయినా, ఇంజనీర్ అయినా, న్యాయవాది అయినా, శాస్త్రవేత్త అయినా, పరిపాలనా అధికారి అయినా, అతడు ముందుగా ఒక బాధ్యతగల పౌరుడు. ఆ పౌరుడికి తన దేశ చరిత్ర, రాజ్యాంగ వికాసం, సామాజిక ఉద్యమాలు, స్వాతంత్ర్య పోరాటం, ప్రాంతీయ సంస్కృతుల గురించి కనీస అవగాహన ఉండాలి. అందుకే అనేక మంది విద్యావేత్తలు ఇంటర్మీడియట్ స్థాయిలో చరిత్రను అందరికీ ఉమ్మడి లేదా తప్పనిసరి సబ్జెక్టుగా ప్రవేశపెట్టాలని సూచిస్తున్నారు. "చరిత్రే మూలం, పౌరశాస్త్రం దాని ఫలం" అనే విద్యావేత్తల భావన కూడా ఇదే విషయాన్ని తెలియజేస్తుంది. చరిత్ర లేకుండా పౌరస్పృహ సంపూర్ణం కాదు.

ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాల అనుభవం కూడా ఇదే చెబుతోంది. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో చరిత్రను కేవలం గతాన్ని బోధించే సబ్జెక్టుగా కాకుండా, ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేసే సాధనంగా ఉపయోగిస్తున్నారు. రెండో ప్రపంచ యుద్ధం, హోలోకాస్ట్, వలసవాదం, బానిస వ్యవస్థ, పౌరహక్కుల ఉద్యమాలు వంటి క్లిష్టమైన అంశాలను కూడా విద్యార్థుల నుంచి దాచిపెట్టకుండా, ఆధారాలతో, విమర్శనాత్మకంగా బోధిస్తారు. తమ చరిత్రలోని విజయాలను మాత్రమే కాదు, వైఫల్యాలను కూడా అధ్యయనం చేయించడం వల్లనే ప్రజాస్వామ్యం మరింత బలపడుతుందని వారు విశ్వసిస్తారు.

భారతదేశంలో కూడా ఇటీవలి సంవత్సరాల్లో చరిత్ర పాఠ్యాంశాలపై విస్తృత చర్చ జరిగింది. ముఖ్యంగా జాతీయ విద్యా పరిశోధన మరియు శిక్షణ మండలి రూపొందించిన పాఠ్యపుస్తకాలలో కొన్ని అధ్యాయాల మార్పులు, తొలగింపులు, పునర్వ్యవస్థీకరణపై విద్యావేత్తలు, చరిత్రకారులు, రాజకీయ పార్టీలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశాయి. విమర్శకుల అభిప్రాయం ప్రకారం, మధ్యయుగ భారత చరిత్ర, మొఘల్ కాలం, మతపరమైన వైవిధ్యం, సామాజిక ఘర్షణలు వంటి అంశాలకు సంబంధించిన కొన్ని భాగాలు తగ్గించబడటం వల్ల విద్యార్థులకు సమగ్ర చారిత్రక అవగాహన దెబ్బతినే ప్రమాదం ఉందని వాదించారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం, ఎన్‌సి.ఇ.ఆర్.టి. అధికారులు పాఠ్యభారం తగ్గించడం, సిలబస్‌ను పునర్వ్యవస్థీకరించడం, కొత్త విద్యా విధానానికి అనుగుణంగా మార్పులు చేయడం వంటి కారణాలను వివరించారు. ఈ రెండు అభిప్రాయాల మధ్య ఏది సరైనదో నిర్ణయించడం కంటే, ఒక సూత్రాన్ని మాత్రం ఎప్పటికీ మరవకూడదు---చరిత్ర రచనకు అంతిమ ప్రమాణం రాజకీయ సిద్ధాంతం కాదు; ఆధారాలు, పరిశోధన, శాస్త్రీయ విశ్లేషణ.

చరిత్ర ఏ ప్రభుత్వానిదీ కాదు. అది ఏ ఒక్క భావజాలానికి చెందిన ఆస్తి కూడా కాదు. ప్రతి కొత్త ప్రభుత్వం తన రాజకీయ దృక్పథానికి అనుగుణంగా చరిత్రను తిరగరాస్తే, రాబోయే తరాలు వాస్తవాలను తెలుసుకునే అవకాశాన్ని కోల్పోతాయి. అందువల్ల చరిత్ర పాఠ్యాంశాల రూపకల్పనలో రాజకీయాలకు బదులుగా స్వతంత్ర చరిత్రకారులు, విశ్వవిద్యాలయ అధ్యాపకులు, పురావస్తు శాస్త్రవేత్తలు, భాషా నిపుణులు, సామాజిక శాస్త్రవేత్తలు కలిసి పనిచేసే వ్యవస్థ మరింత బలోపేతం కావాలి. చరిత్రను కేవలం పాఠ్యాంశంగా కాకుండా జీవన పాఠంగా చూడాల్సిన అవసరం నేడు మరింత పెరిగింది. ఎందుకంటే సమాజం వేగంగా మారుతున్న కొద్దీ, గత అనుభవాల నుంచి నేర్చుకునే అవకాశాలు తగ్గిపోతున్నాయి. సమాచార సాంకేతికత విప్లవం వల్ల ప్రపంచం చిన్నదైనప్పటికీ, ఆ సమాచారంలో నిజం ఏదో, అబద్ధం ఏదో వేరు చేయగల చారిత్రక అవగాహన లేకపోతే యువత తప్పుదారి పట్టే ప్రమాదం ఉంది.

చరిత్ర మనకు కేవలం రాజులు, యుద్ధాలు, ఒప్పందాలు మాత్రమే చెప్పదు. అది సమాజం ఎలా ఆలోచించింది, ఎలా మారింది, ఏ తప్పులు చేసింది, ఏ విజయాలు సాధించింది అన్నదాన్ని కూడా తెలియజేస్తుంది.

తెలంగాణ సందర్భంలో చూస్తే, ప్రాంతీయ ఉద్యమ చరిత్ర ఒక సామూహిక చైతన్యానికి ప్రతీకగా నిలిచింది. దశాబ్దాల పోరాటం, భాషా--సాంస్కృతిక గుర్తింపు కోసం జరిగిన ఉద్యమాలు, సామాజిక న్యాయం కోసం జరిగిన ప్రయత్నాలు ఇవన్నీ యువతకు తెలియాల్సిన ముఖ్యమైన అంశాలు. కానీ ఈ చరిత్రను పాఠశాల స్థాయిలో సరైన రీతిలో బోధించకపోతే, ఆ ఉద్యమాల వెనుక ఉన్న త్యాగాలు కేవలం పుస్తకాల్లోని పేర్లుగానే మిగిలిపోతాయి. ఒక తరం తన గతాన్ని మరచిపోతే, ఆ తరం భవిష్యత్తును నిర్మించడంలో కూడా దిశా నిర్దేశం కోల్పోతుంది.

ఇంకొక ముఖ్యమైన అంశం చరిత్ర బోధనలో విమర్శనాత్మక ఆలోచన (క్రిటికల్ థింకింగ్) అభివృద్ధి. విద్యార్థులు కేవలం తేదీలు, సంఘటనలు గుర్తుపెట్టుకోవడం కాకుండా, ఎందుకు ఆ సంఘటనలు జరిగాయి, వాటి వెనుక ఉన్న సామాజిక --ఆర్థిక --రాజకీయ- సాంస్కృతిక కారణాలు ఏమిటి అన్నది విశ్లేషించగలగాలి. అప్పుడు మాత్రమే చరిత్ర ఒక సజీవ వంతమైన అధ్యయనంగా మారుతుంది. లేకపోతే అది కేవలం పరీక్షల కోసం చదివే భారంగా మారిపోతుంది.

ప్రస్తుత విద్యా విధానంలో నైపుణ్యాలపై ఎక్కువ దృష్టి పెట్టడం అవసరమే అయినా, మానవీయ విలువలను పెంపొందించే సబ్జెక్టులను నిర్లక్ష్యం చేయడం ప్రమాదకరం. సాంకేతిక నైపుణ్యం ఉన్న వ్యక్తి కూడా సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలంటే, అతనికి చరిత్ర, నైతికత, రాజ్యాంగ విలువలపై అవగాహన ఉండాలి. లేకపోతే అభివృద్ధి కేవలం ఆర్థిక పరిమితుల్లోనే ఆగిపోతుంది. సామాజిక సమతుల్యత దెబ్బతింటుంది.

అందువల్ల భవిష్యత్తు విద్యా విధానంలో చరిత్రకు తిరిగి గౌరవప్రదమైన స్థానం ఇవ్వడం అత్యవసరం. అది తప్పనిసరి సబ్జెక్టుగా ఉండాలా లేదా ఉమ్మడి పాఠ్యాంశంగా ఉండాలా అన్నది విధాన నిర్ణయకర్తలు నిర్ణయించవచ్చు. కానీ చరిత్రను పూర్తిగా పక్కన పెట్టే పరిస్థితి మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండకూడదు. ఎందుకంటే చరిత్రను విస్మరించిన సమాజం తనను తాను అర్థం చేసుకోలేని స్థితికి చేరుకుంటుంది.

చివరగా చెప్పాలంటే, చరిత్ర మనకు గతాన్ని మాత్రమే కాదు, భవిష్యత్తును కూడా చూపించే అద్దం. ఆ అద్దాన్ని పగలగొట్టిన జాతి తన దారిని తానే కోల్పోతుంది. అందుకే చరిత్రను చదవడం అంటే కేవలం జ్ఞానం సంపాదించడం కాదు; అది ఒక బాధ్యత, ఒక చైతన్యం, ఒక నాగరికతను నిలబెట్టే ప్రయత్నం.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496
ramkishore.1504@gmail.com

# ప్రతీ రక్తపు చుక్కలో ఒక ప్రాణం..

# ప్రతి పెన్షన్‌లో ఒక కుటుంబానికి భరోసా

ఒక చిన్నారి పుట్టినప్పుడు ఆ కుటుంబం ఎన్నో కలలు కంటుంది. ఆ బిడ్డ చదువుకోవాలి... ఆడుకోవాలి... ఎదగాలి... మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలి అని తల్లిదండ్రులు ఆశపడతారు. కానీ పుట్టిన కొద్ది నెలలకే ఆ బిడ్డకు తలసేమియా లేదా సికిల్ సెల్ వ్యాధి ఉందని తెలిసినప్పుడు, ఆ కుటుంబం జీవితమే ఒక్కసారిగా మారిపోతుంది. ఇతర పిల్లలు పాఠశాలకు వెళ్లి, ఆటలాడుతూ ఆనందంగా గడిపే వయసులో తలసేమియా, సికిల్ సెల్ బాధిత చిన్నారులు ఆసుపత్రులు, రక్తనిధి కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తుంది. నెలకు ఒకసారి లేదా వైద్యుల సూచన మేరకు తరచూ రక్త మార్పిడి చేయించుకోవాల్సి ఉంటుంది. రక్తం కోసం ఎదురుచూపులు, ఆసుపత్రి ప్రయాణాలు, మందుల ఖర్చులు, పరీక్షలు, చికిత్సలు... ఇవన్నీ ఆ చిన్నారి జీవితంలో భాగమవుతాయి. తల్లిదండ్రులకు ప్రతి రక్తపు చుక్క ఒక ఆశ. ప్రతి రక్తదాత ఒక ప్రాణదాత. ప్రతి చికిత్స ఒక కొత్త జీవితం. అందుకే తలసేమియా, సికిల్ సెల్ బాధితుల సమస్యను కేవలం ఆరోగ్య సమస్యగా కాకుండా, ఒక మానవతా సమస్యగా, సామాజిక బాధ్యతగా, ప్రభుత్వ సంక్షేమ ప్రాధాన్య అంశంగా చూడాల్సిన అవసరం ఉంది.

### తలసేమియా అంటే ఏమిటి?

తలసేమియా అనేది అంటువ్యాధి కాదు. ఇది తల్లిదండ్రుల నుంచి పిల్లలకు జన్యువుల ద్వారా సంక్రమించే వారసత్వ రక్త వ్యాధి. మన శరీరంలోని ఎర్ర రక్తకణాలు ఆక్సిజన్‌ను శరీరంలోని అన్ని భాగాలకు చేరవేస్తాయి. ఈ ప్రక్రియలో హీమోగ్లోబిన్ ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. తలసేమియా ఉన్నవారిలో హీమోగ్లోబిన్ ఉత్పత్తి సరిగా జరగకపోవడం వల్ల తీవ్రమైన రక్తహీనత ఏర్పడుతుంది. ముఖ్యంగా తలసేమియా మేజర్‌తో బాధపడే పిల్లలకు చిన్న వయసు నుంచే క్రమం తప్పకుండా రక్త మార్పిడి అవసరం కావచ్చు. తలసేమియా ప్రధానంగా రెండు రూపాల్లో కనిపిస్తుంది.

### తలసేమియా ట్రైట్ లేదా మైనర్:

ఇది ఉన్నవారికి సాధారణంగా తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఉండకపోవచ్చు. చాలామందికి తమలో ఈ జన్యు లక్షణం ఉ ందనే విషయం కూడా తెలియకపోవచ్చు.

### తలసేమియా మేజర్:

ఇది తీవ్రమైన రూపం. పిల్లలకు తరచూ రక్త మార్పిడి, నిరంతర వైద్య పర్యవేక్షణ మరియు దీర్ఘకాలిక చికిత్స అవసరం కావచ్చు. ఇది ఒకరి నుంచి మరొకరికి తాకడం ద్వారా, కలిసి భోజనం చేయడం ద్వారా లేదా పక్కన కూర్చోవడం ద్వారా వ్యాపించదు. ఇది పూర్తిగా జన్యుపరమైన వ్యాధి.

### సికిల్ సెల్ వ్యాధి అంటే ఏమిటి?

సికిల్ సెల్ వ్యాధి కూడా వారసత్వంగా వచ్చే రక్త సంబంధిత వ్యాధే. సాధారణంగా ఎర్ర రక్తకణాలు గుండ్రంగా, మృదువుగా ఉండి రక్తనాళాల్లో సులభంగా ప్రవహిస్తాయి. కానీ సికిల్ సెల్ వ్యాధిలో కొన్ని ఎర్ర రక్తకణాలు కొడవలి ఆకారంలోకి మారతాయి. ఈ అసాధారణ కణాలు చిన్న రక్తనాళాల్లో



అడ్డంకులు కలిగించి తీవ్రమైన నొప్పి, రక్తహీనత, అలసట, ఇన్ఫెక్షన్లు మరియు ఇతర ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు. సికిల్ సెల్ కూడా అంటువ్యాధి కాదు. దీనితో బాధపడుతున్న వారిని వివక్షకు గురిచేయడం లేదా సమాజం నుంచి దూరం పెట్టడం సరికాదు. వారికి అవసరమైనది జాలి కాదు... గౌరవం, ప్రేమ, వైద్య సహాయం మరియు సమాన అవకాశాలు.

### తెలంగాణలో సుమారు 5 వేల మంది చిన్నారుల జీవిత పోరాటం

తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 5 వేల మంది చిన్నారులు తలసేమియా, సికిల్ సెల్ వంటి జన్యుపరమైన రక్త వ్యాధులతో బాధపడుతున్నట్లు అంచనా. ఈ చిన్నారుల్లో అనేక మందికి జీవితాంతం క్రమం తప్పకుండా రక్త మార్పిడి, మందులు, వైద్య పరీక్షలు మరియు నిరంతర వైద్య పర్యవేక్షణ అవసరం అవుతుంది. (ఆగస్ట్ 15 వరకు కరెక్ట్ ఫిగర్ వస్తుంది). ఇతర పిల్లలు పాఠశాలకు వెళ్లి, ఆటలాడుతూ, ఆనందంగా గడిపే వయ-సులో వీరు ఆసుపత్రులు, రక్తనిధి కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ప్రతి నెల రక్త మార్పిడి కోసం ఎదురుచూడటం, రక్తం అందుతుందా లేదా అనే ఆందోళన, చికిత్స ఖర్చుల భారం... ఇవన్నీ బాధిత చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రుల జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. అయితే ఈ చిన్నారులు కేవలం రోగులు కాదు. వారు కూడా ఎన్నో కలలు, ఆశలు, ఆశయాలతో జీవిస్తున్న మన పిల్లలే. వారికి అవసరమైన సమయంలో రక్తం, వైద్యం, ఆర్థిక భరోసా అందించడం సమాజం మరియు ప్రభుత్వ బాధ్యత.

### రెడ్ క్రాస్ సేవలు - రక్తం ద్వారా ప్రాణాలకు భరోసా

తలసేమియా, సికిల్ సెల్ బాధిత చిన్నారుల జీవితాల్లో రక్తం అత్యంత కీలకమైన అవసరం. ఒక చిన్నారి ఆరోగ్యంగా జీవించడానికి క్రమం తప్పకుండా రక్త మార్పిడి అవసరమయ్యే పరిస్థితుల్లో, సురక్షిత రక్తం సకాలంలో అందడం వారి ప్రాణాలకు ఆధారం. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్రంలోని పలు రక్తనిధి కేంద్రాల ద్వారా తలసేమియా, సికిల్ సెల్ బాధిత చిన్నారులకు ఉచితంగా రక్తాన్ని అందిస్తూ మానవతా సేవలు కొనసాగిస్తోంది. హనుమకొండ, హైదరాబాద్, నిజామాబాద్, మంచిర్యాల, భద్రాచలం, మహబూబ్‌నగర్, నల్గొండ మరియు కరీంనగర్ ప్రాంతాల్లోని రెడ్ క్రాస్ రక్తనిధి కేంద్రాలు తలసేమియా, సికిల్ సెల్ బాధిత చిన్నారులకు అవసరమైన రక్తాన్ని ఉ చితంగా సరఫరా చేస్తూ వారి కుటుంబాలకు గొప్ప భరోసా కల్పిస్తున్నాయి. రక్తదాతలు స్వచ్ఛందంగా అందించే ప్రతి రక్తపు యూనిట్ ఒక చిన్నారి జీవితంలో కొత్త ఆశను నింపుతోంది. రక్తదానం చేసే ప్రతి వ్యక్తి కేవలం రక్తాన్ని అందించడం కాదు... ఒక కుటుంబంలో ఆశను నిలబెడుతున్నారు.

"ఒక రక్తదాత ఇచ్చే రక్తం... ఒక చిన్నారి జీవితంలో మరో ఉదయాన్ని తీసుకురాగలదు."

రెడ్ క్రాస్ రక్తనిధి కేంద్రాలు నిర్వహిస్తున్న ఈ సేవలు బాధిత కుటుంబాలపై పడుతున్న ఆర్థిక భారాన్ని కొంతవరకు తగ్గించడమే కాకుండా, నిరంతర చికిత్సకు అవసరమైన రక్తం అందుబాటులో ఉండేలా కీలక పాత్ర పోషిస్తున్నాయి.

### ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సేవలు

తలసేమియా, సికిల్ సెల్ బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా అవసరమైన వైద్య సేవలు అందిస్తోంది. ఈ సేవలు బాధిత కుటుంబాలపై పడుతున్న చికిత్స ఖర్చుల భారాన్ని తగ్గించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయి. అవసరమైన వైద్య పరీక్షలు, నిపుణుల వైద్య సేవలు, ఐరన్ చీలేషన్ , చికిత్స మరియు ఇతర వైద్య అవసరాలకు ప్రభుత్వ సహాయం అందడం వల్ల ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు కొంత ఊరట లభిస్తోంది.

### పెన్షన్ నిర్ణయం -- బాధిత కుటుంబాలకు గొప్ప భరోసా

ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సేవలు, రెడ్ క్రాస్ రక్తనిధి కేంద్రాల ద్వారా ఉచిత రక్తం , మందులు అందుతున్నప్పటికీ, ఇతర ఖర్చులు బాధిత కుటుంబాలపై ఆర్థిక భారాన్ని మోపుతున్నాయి.

ఈ నేపథ్యంలో తలసేమియా, సికిల్ సెల్ బాధితులకు పెన్షన్ అమలు చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం అత్యంత ప్రాధాన్యత కలిగినది. ఈ పెన్షన్ కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదు... నిరంతర చికిత్స కోసం పోరాడుతున్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉందనే భరోసా. 2018లో ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయినప్పటికీ ఇంతకాలం అమలుకు నోచుకోని పెన్షన్‌ను, గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు ఆగస్టు 15 నుంచి అమలు చేయనున్నట్లు ప్రకటించడం బాధిత కుటుంబాల్లో కొత్త ఆశలను నింపింది.

రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి సహకారంతో, రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ఆధ్వర్యంలో బాధితుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం అభినందనీయమైన విషయం. బాధితుల సమస్యలను గుర్తించి, వారి సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ పెన్షన్ అమలుకు నిర్ణయం తీసుకున్న గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారికి ప్రతి తలసేమియా, సికిల్ సెల్ బాధిత కుటుంబం కృతజ్ఞతతో రుణపడి ఉంటుంది.

ఈ నిర్ణయం వల్ల రాష్ట్రంలోని వేలాది మంది బాధిత చిన్నారుల కుటుంబాలకు ఆర్థిక ఊరట లభిస్తుంది. తమ పిల్లల చికిత్స కోసం ప్రతినెలా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తల్లిదండ్రులకు ఇది గొప్ప భరోసా.

పెన్షన్ తో పాటు బాధిత చిన్నారులకు విద్యలో ప్రత్యేక సహాయం, పాఠశాలల్లో హాజరు విషయంలో సానుకూల విధానం, ఉన్నత విద్యకు స్కాలర్‌షిప్‌లు , ఉచిత బస్ పాస్లు అందించాలి. పెద్దవారైన బాధితులకు ఉపాధి అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి మరియు సామాజిక భద్రత కల్పించాలి.

ఒక కుటుంబం ఈ వ్యాధితో పోరాడుతున్నప్పుడు, ఆ కుటుంబాన్ని ఒంటరిగా వదిలేయకూడదు. ప్రభుత్వం, వైద్యులు, రెడ్ క్రాస్, స్వచ్ఛంద సంస్థలు, రక్తదాతలు మరియు సమాజం అందరూ కలిసి వారికి అండగా నిలవాలి.

"బాధితుల సంక్షేమమే లక్ష్యంగా... భరోసానిచ్చే ప్రజా ప్రభుత్వం."

తలసేమియా, సికిల్ సెల్ బాధితుల జీవితాల్లో ఆశలు నింపే పెన్షన్ నిర్ణయం తీసుకున్న గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి కి, ఈ అంశానికి సహకరించిన రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి గారికి, వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), పంచాయతీ రాజ్ , గ్రామీణాభివృద్ధి స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం దాన కిషోర్ , సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ , వైద్యులకు, రెడ్ క్రాస్ సేవకులకు మరియు ప్రతి స్వచ్ఛంద రక్తదాతకు హృదయపూర్వక కృతజ్ఞతలు.



-ఇ. వి. శ్రీనివాస్ రావు
ఐఆర్‌సీఎస్ రాష్ట్ర పాలక మండలి సభ్యులు

3-08-2026_Layout 1 03-08-2026 19:15 Page 6



# 19వసారి ఓ నెగెటివ్ రక్తదానం



**అక్షరశక్తి,వరంగల్:** మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా వరంగల్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని క్విక్ రియాక్షన్ టీమ్ కానిస్టేబుల్ చిలువేరు మహేందర్ యాదవ్ మరోసారి తన సేవా తత్వాన్ని చాటుకున్నారు. అత్యంత అరుదైన ఓ నెగెటివ్ (ా చీవస్త్రుఖఅజవ) రక్తం అత్యవసరంగా అవసరమైన ఓ రోగి ప్రాణాలను కాపాడేందుకు ఆయన 19వసారి స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. జనగాం జిల్లా పాలకుర్తి మండలం తొర్రూరు గ్రామానికి చెందిన చిలువేరు కృష్ణమూర్తి--మల్లమ్మ దంపతుల ద్వితీయ కుమారుడైన మహేందర్ యాదవ్, ఏఆర్-2009 బ్యాచ్ కానిస్టేబుల్‌గా ప్రస్తుతం వరంగల్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తున్నారు.

ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బి. ఉమా అనే రోగికి అత్యవసరంగా ఓ నెగెటివ్ రక్తం అవసరమని సమాచారం అందగానే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా మహేందర్ యాదవ్ స్పందించి ఎంజీఎం ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్‌కు చేరుకుని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అత్యంత అరుదైన రక్తగ్రూప్ కలిగిన వ్యక్తిగా ఇప్పటికే పలుమార్లు అవసరమైన వారికి రక్తదానం చేసిన మహేందర్ యాదవ్, ఇప్పుడు 19వసారి రక్తదానం చేసి మరో ప్రాణానికి ఆశాకిరణంగా నిలిచారు. ఆయన సేవాభావాన్ని వైద్య సిబ్బంది, సహచర పోలీసులు, స్థానికులు అభినందించారు.

అత్యవసర సమయాల్లో స్వచ్ఛంద రక్తదాతలే అనేక మంది ప్రాణాలను కాపాడగలరని, ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలని మహేందర్ యాదవ్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# ఇంజనీరింగ్ విద్యార్థులకు క్షమాపణ చెప్పాలి : ఏనుగుల రాకేష్ రెడ్డి




**అక్షరశక్తి,హైదరాబాద్:** తెలంగాణ ఇంజనీరింగ్ విద్యార్థులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ కాంటెస్ట్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఏనుగుల రాకేష్ రెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ సంస్థల్లో ప్రతిభ చాటుతూ రాష్ట్రానికి మంచి పేరు తీసుకొస్తున్నారని అన్నారు. అలాంటి విద్యార్థులను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని విమర్శించారు. రాష్ట్రంలో ఐటీ రంగ అభివృద్ధికి ఇంజనీరింగ్ విద్యార్థులే ప్రధాన బలమని, హైదరాబాద్ దేశంలోనే అతిపెద్ద ఐటీ హబ్‌గా ఎదగడంలో వారి కృషి ఎంతో ఉందన్నారు. గతంలో యువతకు అవకాశాలు కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం, ఇప్పుడు ఇంజనీరింగ్ విద్యార్థులపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం విరుద్ధ ధోరణిగా ఉందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని, లేకపోతే కొడంగల్ నియోజకవర్గంలో లక్ష మంది ఇంజనీరింగ్ విద్యార్థులు నామినేషన్లు దాఖలు చేసి ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన వ్యక్తం చేస్తారని హెచ్చరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై పలు రాజకీయ విమర్శలు చేస్తూ, విద్యార్థుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను ప్రజలు సహించబోరని రాకేష్ రెడ్డి అన్నారు.



## అవయవదానం మహోన్నత మానవతా సేవ: నిమ్మల శ్రీనివాస్

**అక్షరశక్తి, హనుమకొండ:** జాతీయ అవయవదాన దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ అవయవదానంపై అవగాహన పెంపొందించుకుని, మరణానంతరం తమ అవయవాలను దానం చేసేందుకు ముందుకు రావాలని తెలంగాణ శరీర, నేత్ర, అవయవదాన సభ్యుడు, సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒక అవయవదాత గుండె, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, నేత్రాలు తదితర అవయవాలను దానం చేయడం ద్వారా పలువురికి ప్రాణదాతగా నిలవవచ్చని తెలిపారు. అవయవదానం అనేది కేవలం ఒక దానం మాత్రమే కాకుండా, అనేక కుటుంబాల్లో ఆశాజ్యోతిని వెలిగించే అత్యున్నత మానవతా సేవ అని పేర్కొన్నారు. అవయవదానంపై ప్రజల్లో ఉన్న అపోహలు, భయాలను విడనాడాలని, కుటుంబ సభ్యులతో ఈ అంశంపై చర్చించి స్వచ్ఛందంగా అవయవదాన ప్రతిజ్ఞ చేయాలని సూచించారు.



# పర్యావరణ పరిరక్షణపై జాతీయ సదస్సు

**అక్షరశక్తి, కేయూ క్యాంపస్:** కాకతీయ విశ్వవిద్యాలయం స్వర్ణోత్సవాల సందర్భంగా "వ్యూహాత్మక మరియు సుస్థిర పర్యావరణ పరిరక్షణకు సంస్థల సమన్వయం" అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, సుస్థిర అభివృద్ధి వంటి కీలక అంశాలపై దేశవ్యాప్తంగా ఉన్న శాస్త్రవేత్తలు, పరిశోధకులు, విధాన రూపకర్తలు, విశ్వవిద్యాలయ అధ్యాపకులు, పరిశ్రమల ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, విద్యార్థులు, సామాజిక సంస్థల ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొననున్నారు. వికసిత భారత్--2047, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు (ఎస్‌డీజీలు), కాలుష్య నియంత్రణ, వృత్తాకార ఆర్థిక వ్యవస్థ, వనరుల సమర్థ వినియోగం వంటి జాతీయ లక్ష్యాల సాధనలో ఈ సదస్సు కీలక పాత్ర పోషిస్తుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణ ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొన్న నిర్వాహకులు, దేశంలోని విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, పరిశ్రమలు, ప్రభుత్వ శాఖలు, పర్యావరణ నిపుణులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సూచనలు, అనుభవాలను పంచుకోవాలని ఆహ్వానించారు.

# వెల్ నెస్ సెంటర్ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలి

**అక్షరశక్తి, హనుమకొండ:** వెల్ నెస్ సెంటర్ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలని హనుమకొండ జిల్లా ఇంచార్జి కలెక్టర్ ఎన్. రవి అన్నారు. సోమవారం హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి వైద్యశాల పక్కన ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు, జర్నలిస్టులు, పెన్షనర్లకు వైద్య సేవలను అందించే వెల్ నెస్ సెంటర్ ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వెల్ నెస్ సెంటర్ లోని జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, డెంటల్, కంటి విభాగం, ల్యాబ్, ఫార్మసీ, ఓపీ విభాగాలను పరిశీలించారు. ఎంతమంది వైద్యులు, సిబ్బంది విధులకు హాజరయ్యారని అదనపు కలెక్టర్ వెల్ నెస్ సెంటర్ ఇన్ ఛార్జీ డాక్టర్ సుష్మితను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేశారు. అక్కడికి వైద్య సేవల నిమిత్తం వచ్చిన పేషంట్లతోనూ మాట్లాడి వైద్య సేవలు ఎలా ఉంటున్నాయని అడిగారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ వెల్ నెస్ సెంటర్ కు వచ్చే పేషంట్లకు ఎక్కడ కూడా ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్య సేవలను అందించాలని సూచించారు. వెల్ నెస్ సెంటర్ వద్ద పరిసరాలు బాగుండాలన్నారు. ప్రత్యేక విభాగాల వైద్య నిపుణుల చేత కూడా వైద్య సేవలను పేషంట్లకు అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మందుల కొరత లేకుండా చూసుకోవాలన్నారు. ల్యాబ్ ద్వారా పేషంట్లకు అవసరమయ్యే వివిధ పరీక్షలని నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, వైద్యులు పాల్గొన్నారు.



Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.